భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL



# భూమిని కాపాడితేనే పంటకు భరోసా



**భారత్ సమాచార్, మహబూబాబాద్ జిల్లా**: రసాయన ఎరువుల మితిమీరిన వినియోగంతో నేల ఆరోగ్యం దెబ్బతినకుండా భూసారాన్ని కాపాడుకోవాలని, ప్రకృతి ఆధారిత సాగు పద్ధతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవడం, నీటిని పొదుపుగా వినియోగించడం ద్వారా సాగులో నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.

ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం 'ఖేత్ బచావో అభియాన్'పై రైతులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచి తమ్మడపల్లి కుమార్, ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుహాసిని, ఎంపీడీవో పార్థసారథి, మండల వ్యవసాయాధికారి షేక్ యాస్మిన్ తదితరులు హాజరయ్యారు.

## భూసార పరిరక్షణతోనే మెరుగైన దిగుబడులు

రసాయన ఎరువులను అవసరానికి మించి వినియోగించడం వల్ల నేల నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు తెలిపారు. భూసారాన్ని పెంపొందించుకోవడం ద్వారా పంటల దిగుబడులను మెరుగుపరచుకోవచ్చని చెప్పారు. సేంద్రియ, సహజ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని దీర్ఘకాలం కాపాడుకోవచ్చని రైతులకు వివరించారు.

ప్రతి సీజన్‌లో ఒకే రకమైన పంట సాగు చేయకుండా పంటల మార్పిడికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పంట కోత అనంతరం మిగిలే వ్యర్థాలను కాల్చివేయకుండా, వాటిని భూసారం పెంపొందించేందుకు ఉపయోగించుకోవాలని తెలిపారు. నేల ఆరోగ్యాన్ని కాపాడే పద్ధతులను అనుసరిస్తే భవిష్యత్తులోనూ వ్యవసాయ ఉత్పాదకతను కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



## ఎల్ నినో ప్రభావం.. ఆరుతడి పంటలపై దృష్టి

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ శ్రీనివాసరావు సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అధిక నీరు అవసరమయ్యే పంటలను సాగు చేసి నష్టపోవద్దని చెప్పారు. పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటల సాగువైపు మొగ్గు చూపాలని, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

## పంటల వైవిధ్యీకరణపై శాస్త్రవేత్త అవగాహన

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుహాసిని మాట్లాడుతూ.. పంటల వైవిధ్యీకరణ, నానో యూరియా వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎరువులను శాస్త్రీయ పద్ధతుల్లో, పంట అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని తెలిపారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా అందుబాటులో ఉన్న వనరులతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు.

ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు, దిశ సభ్యులు బాబురావు, ఉద్యానవన అధికారి స్రవంతి, వెటర్నరీ డాక్టర్ రవీందర్, ఇరిగేషన్ ఏఈ విజయ్, ఏఈఓ భాస్కర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar